ప్రమీల గూడా బిత్తర పోయింది హరి వాలకానికి.

అతడి షర్టు వదిలేసి, "లేకపోతే పెళ్ళి చేసుకుంటూ "ఇన్విటేషన్" గూడా పంపవన్నమాట – జాగ్రత్త, హార్డీ అంతే ఏవనుకున్నావో. హు!" అన్నాడు కాలర్ పైకెత్తి.

మూర్తి తేరుకుని, "ఆ మాటలు చెప్పి, చేతికిద్దామనే ఇవి పట్టుకొచ్చాన్రా!" అంటూ పళ్ళ బుట్ట చేతికిచ్చాడు.

ఇంతలో గుంటూరు బస్సు వచ్చింది.

"ఒరేయ్, హరీ! వీలుచూసుకుని గుంటూరు రారా, నువ్వు జీవితంలో మరచిపోలేని మాంచి ప్రజెంటేషన్ ఇవ్వాలనుకుంటున్నాను" - అని ప్రమీల వంక చూసేడు. ప్రమీల, హరి పరస్పర విలోకన క్రియా తత్పరులై ఉండటం చూసి నవ్వుకుంటూ బుకింగ్ వైపు నడిచాడు మూర్తి.

* * *

మర్నాడు ప్రమీలకోసం గుంటూరు వెళ్ళాడు హరి. ఇద్దరూ కలిసి పార్క్‌కు వెళ్ళి ఒక మూలగా పచ్చికమీద కూర్చున్నారు.

"ఎప్పుడూ నన్ను విడిచి వుండవు కదూ ?" అన్నాడు హరి, జంటగా సమీపంలో తిరుగుతున్న గోరువంకలను చూస్తూ, ఆమె వీపుకు తన వీపు ఆన్చి.

"ఎప్పటికీ నేను మీదాన్ని!" అన్నది ప్రమీల చేతిలో వున్న క్రోటన్స్ ఆకుని రెండుగా చీలుస్తూ.

తనమీద పూర్తిగా హరి ఆధారపడి ఉన్నాడని తెలిసినా, ఎందుకో ఒక్కసారి ప్రక్కకు జరిగింది ఓలిపిగా ప్రమీల.

"ప్రమీలా!" అని అరిచాడు వెనక్కి వ్రాలుతున్న హరి, హఠాత్తుగా ఆమె విడిచి పోతున్నట్లు ఫీలవుతూ.

* * *

స్వప్నహలో లేకుండానే "ప్రమీలా!" అని భార్యని కలవరిస్తూ ప్రక్కమీదనుండి లేస్తున్న శ్రీహరిని అదిమి పట్టారు, మందివ్వటానికి వచ్చిన నర్సూ, కాంపౌండరూ.

ప్రేమించి పెళ్ళాడిన భార్య నెల రోజుల క్రితం మరణించింది. ఆ దిగులుతో మంచం పట్టిన కొడుకు కలవరింత కొంచెం దూరంలో కూర్చుని దుఃఖిస్తున్న కన్నవాళ్ళ గుండెల్ని నిలువునా చీల్చేసింది.

ఇంతలో డాక్టర్ వచ్చి చెయ్యి పట్టుకుని శ్రీహరి నాడి పరీక్షిస్తూ, మొహం వంక చూశాడు. శ్రీహరి ప్రశాంతంగా ఉన్నాడు. ఆయన నిశ్శబ్దంగా చెయ్యి వదిలేసి గొంతు వరకూ కప్పివున్న దుప్పటిని తల వరకూ కప్పి గబగబా వెళ్ళిపోతూ "అయిపోయింది" అని గొణుక్కున్నాడు.

***



# వివాహం కుదిరింది

"అయితే మీకూ పెళ్ళి కావలసినఅమ్మాయి ఉందన్నమాట?" ఎదుటి పెద్దమనిషి ప్రశ్నకి అవునన్నట్లుగా తలాడించా డాయన.

మనిషి చూడబోతే చాలా హుందాగావున్నాడు. గ్లాస్కో పంచ, లాల్చి, రిమ్‌లెస్ కళ్ళద్దాలు.

ఎంత సేపటినుండో చూస్తున్నా. ఎదుటి పెద్దమనిషి ఊరికే తనస్వంత డబ్బా వాయించేసుకొంటున్నాడు. తనకి పెద్దకారు, అందమైన రామ్మోహన్ లాటి అబ్బాయీ (ఊరికే ఉండడంకాదు. ఏదో పెద్ద ఉద్యోగం చేస్తున్నట్టుకూడా) యింకా ఎన్నో ఉన్నాయిట. లాయర్‌గా ఆయన సంపాదించిన డబ్బు దేశంలో మరే లాయరూ జన్మలో సంపాదించలేడట.

ఈ రెండో పెద్దమనిషి బుట్టలో పడ్డట్టున్నాడు. మెల్లగా సంభాషణలోకి జొరబడ్డాడు. వాళ్ళ సంభాషణబట్టి ఈయనకొక గ్రాడ్యుయేట్ అమ్మాయి ఉన్నట్లూ, ఆమెకు వివాహం కావలసి ఉన్నట్లూ తేలింది.

నాకు కుతూహలం కలిగింది. ఎందుకంటే మన దేశంలో పెళ్ళిళ్ళు కుదరడం అనేది చాలా విచిత్రంగా జరుగుతుంది. విశాఖపట్నంలో అబ్బాయీ, ఢిల్లీలో అమ్మాయీ ఎలా జోడు కుదుర్తారో వింతగా ఉంటుంది.

"అయితే మీ మేడ చాలా పెద్దదన్నమాట" ఎదుటాయన ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"పెద్దదా ... మెల్లగా అంటూరేమిటా మాట ? నా చెమటోడ్చి సంపాదించిన డబ్బుతో కట్టా నా మేడని. రెండు లక్షలు దరిదాపు ఖర్చయింది మూడంతస్తులకీ. అద్దెకివ్వరాదా అని ఎంతోమంది అడుగుతున్నారనుకోండి. వెధవ అద్దె. మనకి సుఖం ఉండదు నాన్నా అని మా వాడే ఉంచేయమన్నాడు. ఐనా ... శంకర్రావుగారి మేడంటే ... మీకే తెలుస్తుందిగా మా వూరు వచ్చినప్పుడు."

"ఏ ఊరన్నారూ?" మొదటాయన ప్రశ్నకి "ఏమీ అనలేదండీ" అని పాత జోక్ వేయకుండా ఊరిపేరు చెప్పాడాయన.

"అబ్బా" అన్నాడు ఎదుటాయన అదేదో ప్రపంచ వింత అయినట్లు.

"అన్నట్లు మీ అమ్మాయి తెల్లగా ఉంటుందా ? మా వాడికి తెల్లగా ఉంటేకాని నచ్చరులెండి. ఇప్పటికే ఎందరో వస్తున్నారు. ఒకాయన లక్షా

రెండవ బహుమతి రు. 25

పి. వెంకటేశ్వరరావు
ఎమ్. ఎస్ సి. (ఫైనల్)
కెమిస్ట్రీ (ఇనార్గానిక్)
ఆంధ్ర విశ్వవిద్యాలయ కళాశాల
వాల్తేరు.

ఏభైవేలు యిస్తామన్నాడు. కాని... చూడండి ఆ అమ్మాయి అంత తెలుపుకాదు" జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి సిగరెట్ వెలిగించాడు శంకర్రావుగారు.

"ఏదోలెండి. మా అమ్మాయిని నేను పొగడకూడదు కాని... నా రంగులో ఉంటుంది" మందహాసంతో ఎదుటాయన అన్నదానికి పగలబడి నవ్వాడు శంకర్రావుగారు, "బలే జోక్ వేశారే" అన్నట్లు. నిజానికి ఆయన చాలా తెల్లగా ఉన్నాడు.

"శంకర్రావుగారూ!" ఆరంభించాడు ఎదుటాయన. "నా పేరు రాజశేఖరం. మా అమ్మాయిని మీవాడికి చూపి నచ్చితే మీతో వియ్యం పొందాలనుంది. ఎందుకంటే మీరు నాకెంతో నచ్చారు."

ఇక శంకర్రావుగారు విజృంభించారు. తన స్థిరచరాస్తుల వివరాలూ, సంపాదించినడబ్బూ (బ్లాక్-వైట్) అన్నీ పూసగుచ్చి మెడలో వేసినంత పొందిగ్గా చెప్పాడు. ఎందుకంటే వివాహ విషయాల్లో ఎదుటివారికి అధికులుగా కనబడాలి.

అంతా చెప్పేసి "మీకు స్వంత యిల్లు వుందా?" అన్నాడాయన. అది లేకపోతే తనతో మాట్లాడడానికే అనర్హుడు అన్నట్లు.

ఎదుటి పెద్దమనిషి దెబ్బతిన్నట్లున్నాడు, "క్షమించండి. అవేమీ నాకు లేవు. కాని మా అమ్మాయి మాత్రం బుద్ధిమంతురాలు."

"ఎవరు కాదండీ. ఈ రోజుల్లో ఆస్తిలేనిదే ఏంచేయగలరు చెప్పండి? ఈ కాస్ట్లీ సొసైటీలో జీవితమే దుర్భరం."

ఇంకా ఆయన ఉపన్యాసం అలా కొనసాగును కానీ యింతలో సినిమాలోలా ఒక వింత జరిగింది

"శంకర్రావుగారూ! మీరు ఇన్‌కంటాక్స్ ఎంత కడుతున్నారు" రాజశేఖరంగారి పక్కనే ఉన్న జమా జెట్టిలాటి మనిషి ప్రశ్నించాడు.

శంకర్రావుగారు తెల్లబోయారు ఒక్క క్షణం. కాని వెంటనే తేరుకొని "డబీజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్" అన్నారు కోపంగా.

"కాదు. అవసరమే" రాజశేఖరంగారు మందహాసంతో అన్నారు.

"క్షమించండి. మా అమ్మాయికి ఆరు సంవత్సరాల క్రితమే పెళ్ళయింది. ప్రస్తుతం నేను గవర్నమెంట్ తరఫున ఇన్‌కమ్‌టాక్స్ ఎగొడుతున్న వారిని పట్టడానికి బయలుదేరాను. ఈ రోజుకి మీరు మొదటివారు. మీమీద అనధికారంగా వచ్చిన రిపోర్టుల ననుసరించే ఇలా ప్లాన్ వేయాల్సి వచ్చింది. అంచేత మీ సంభాషణ అంతా రికార్డయిందని మాత్రం మరవకండి."

నా ఆశ్చర్యానికి మేర లేదు. వివాహాలు ఎలా కుదుర్తాయో చూడకపోయినా నేరస్థుల్ని పరిశోధకులు ఎలా పట్టుకొంటారో చూడగలిగాను. ఇంతకూ పాపం వివాహం కుదిరింది శంకర్రావుగారి అబ్బాయికి కాదు, ఆయనకే!

***



# 'దొంగ... దొంగ... పట్టుకోండి!'

ఒగర్చుకుంటూ అప్పుడే బయలుదేరుతున్న "హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్"లో ఎక్కాడు రాములు. గుండె ఇంకా దడదడమని కొట్టుకుంటూనే వున్నది. "దొంగ... దొంగ పట్టుకోండి!" అన్న కేకలు యింకా చెవిలో మారుమ్రోగిపోతున్నాయి. తను తప్పేం చేశాడు? నలుగురి దృష్టిలో "దొంగ" అయినాడు. కొన్ని గంటలముందు జరిగిన సంఘటనలు గుర్తుకు రాసాగాయి.

రాత్రి తొమ్మిదవుతుంది. ఇంకా సినిమా వదిలి పెట్టలేదు. రిక్షా రోడ్డు ప్రక్కకు తోసి, రోడ్డు మీద నిలబడ్డాడు రాములు.

"ఏయ్ రిక్షా! మూర్తిమహల్ కొస్తావా?" అడిగాడు ఒక పెద్దమనిషి.

"ఎక్కండి బాబూ!" అన్నాడు రాములు.

మూర్తిమహల్ దగ్గర దిగి, "మళ్ళీ యిప్పుడే వస్తాను" అంటూ బాడుగ ఇవ్వకుండా లోనికి వెళ్ళాడతను.

"సెంటర్‌కు పోనీయవోయ్!"

వెనక్కి తిరిగి చూశాడు రాములు. రిక్షాలో ఎవరో కూర్చుని వున్నారు.

"రానండీ... బాడుగ వుంది" అన్నాడు రాములు. రిక్షాలో కూర్చున్నతను దిగి, వెళ్ళిపోసాగాడు. అతను దిగుతుంటే ఏదో కాగితం సీటు మీద నుంచి క్రింద పడటం చూశాడు రాములు.

వంద రూపాయల నోటు!

రాములు మనస్సులో అనేకమయిన ఆలోచనలు పరుగులెత్తినాయి. చివరకు అతనిలోని న్యాయబుద్ధే గెలిచింది.

"ఏమండోయ్!"

వెళ్ళుతున్నతను వెనక్కి తిరిగి చూశాడు.

"ఇదిగోనండి, మీ డబ్బు రిక్షాలో పారేసుకున్నారు."

అతను అయోమయంగా చుట్టూ చూశాడు.

రెండవ బహుమతి రు. 25

**అలపర్తి రామకృష్ణ**
బి. ఏ. (మొదటి సం॥)
పి. బి. ఎన్. కాలేజి,
నిడుబ్రోలు, గుంటూరు జిల్లా.